అధ్వానంగా పారిశుధ్యం.. ఆపై నిర్లక్ష్యం

- సమస్యల వలయంలో వేణుగోపాలపురం
- వర్షాల కారణంగా వీధుల్లో అపరిశుభ్రత
- పూడుకుపోయిన డ్రెయినేజీలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వేణుగోపాలపురంలో కాలువలో పేరుకుపోయిన చెత్త



దోమలకు నిలయంగా మారిన డ్రెయినేజీ

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ మండలం వెంకటనగరం పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురం సమస్యల వలయంలో చిక్కుకుంది. ఈ కాలనీలో ఎక్కడ చూసినా తీవ్ర అపరిశుభ్రత కనిపిస్తోంది. అస్తవ్యస్తమైన డ్రెయినేజీ వ్యవస్థతో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీ ఏర్పడి ఏళ్లు గడిచినా అక్కడ కనీస మౌలిక వసతులు కల్పించడంలో పంచాయతీ పాలకులు, అధికార యంత్రాంగం దారుణంగా విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ఆరోపణలకు తగినట్లుగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు కూడా ఉన్నాయి.

కుళాయిలకు తాగునీరు ఏదీ?

కాలనీకి తాగునీటి కుళాయిలు వేసి ఏళ్లు గడిచినా అవి వాటికి ఇప్పటి వరకు నీరు సరఫరా చేయలేదని కాలనీ వాసులు తెలిపారు. మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేదని వారన్నారు. చెత్తా, చెదారంతో మురుగు కాలువలు మొత్తం పూడుకుపోయాయని, దీంతో ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచి దుర్వాసనలు వెదజల్లుతున్నాయన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు నిత్యం భయాందోళన మధ్య జీవనం సాగిస్తున్నారంటున్నారు. ఎక్కడికక్కడ పిచ్చిమొక్కలు, పొదులతో నిండిపోవడంతో తరచూ ఈ కాలనీలోని ఇళ్లలోకి విషసర్పాలు ప్రవేశిస్తున్నాయని అక్కడి నివాసితులు చెబుతున్నారు. పేరుకు రాజమహేంద్రవరం సిటీకి దగ్గరగా ఉన్నా చిట్టడివిలోనే తాము బతుకుతున్నట్లుగా ఉంటోందని వేణుగోపాలపురం కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధిలైట్లు లేక కాలనీలో అంధకారం

వేణుగోపాలపురం కాలనీలోని ఏ వీధిలో చూసినా వీధిలైట్లు మచ్చుకు కూడా కానరావడం లేదన్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే అంధకారమయమైన కాలనీలోకి అడుగుపెట్టాలంటేనే జనం హడలిపోతున్నారని స్థానికులు అన్నారు. ఒక పక్క వీధికుక్కల బెడద కూడా పెరిగిందని వారన్నారు. దీంతో చీకటి పడితే కాలనీలోకి రాకపోకలు సాగించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి, కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని వేణుగోపాలపురం కాలనీ వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాస్థాయిలో సెప్టెంబర్ 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌తో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. జిల్లా కోర్టు చాంబర్‌లో రాజమహేంద్రవరంలోని న్యాయవాదులతో గంధం సునీత శనివారం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ఎన్.శ్రీలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులందరితో సమావేశం నిర్వహించారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ

కంబాలచెరువు: జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అధికారులను ఎస్పీ డి.నరసింహాకిశోర్ శనివారం సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కె.రమేష్‌బాబు, త్రీటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రామకృష్ణను ఎస్పీ శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అడిషనల్ ఎస్పీలు యంబీయం.మురళీకృష్ణ, అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచి రెడ్డి, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

తాగునీటి పైపుల వద్ద పరిశుభ్రత పాటించాలి



సిమెంటు పళ్లాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ స్టాలిన్

కడియం: గ్రామంలోని తాగునీటి పైపుల వద్ద పరిశుభ్రత పాటించాలని సర్పంచ్, కడియం మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసులు కోరారు. గ్రామంలోని పైపుల వద్ద సిమెంట్ పళ్లాలను నిర్మిస్తున్నారు. ఆయా పనులను శనివారం స్టాలిన్ పరిశీలించారు.

అలరించిన హరికథా గానం



కళాకారులను సత్కరిస్తున్న అన్నపూర్ణ తదితరులు

సీటీఆర్ఐ: ప్రాచీన కళల్లో హరికథా గానం ఒకటని పురాణం విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆంధ్ర యువత సంస్కృత కళాశాలలో నిర్వహిస్తున్న 54వ సపర్యా మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పార్వతీ కల్యాణం హరికథా గానం అలరించింది. పురాణం విజయలక్ష్మి హరికథా గానం చేయగా సాయికృష్ణ మృదంగం, గణపతి వయోలిన్‌తో సహకరించారు. అనంతరం కళాకారులను పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి కనీస అభ్యసన స్థాయిపై దృష్టి సారించాలి

కంబాలచెరువు: విద్యార్థి కనీస అభ్యసన స్థాయిల సాధనకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డైట్ లెక్చరర్, క్లస్టర్ కాంప్లెక్స్ లైజనింగ్ ఆఫీసర్ కె.దుర్గబాబు అన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని డీఎమ్‌హెచ్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన శనివారం పరిశీలించారు. ఉపాధ్యాయుల నుద్దేశించి దుర్గబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. డీఎమ్‌హెచ్ క్లస్టర్ కాంప్లెక్స్ సెక్రటరీ పరస జగన్నాథరావు, సీఆర్‌యంటీ జయంతి శాస్త్రి, క్లస్టర్‌లోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

రాజానగరం: చదువుతోపాటు చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరానికి చెందిన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. రెడ్డిప్రసన్న సూచించారు. దివాన్‌చెరువు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయపాలన, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల యాంపీ థియేటర్‌లో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో యాంపీ టాక్స్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాస్యనటుడు భద్రం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్తీ మైండ్స్, హ్యాపీ మైండ్స్ అనే అంశంపై మాట్లాడారు. విద్యార్థి దశలో సమయపాలన, క్రమశిక్షణ, భౌతిక వ్యాయామాలు, ప్రాణాయామం, మంచి నిద్ర, హాస్య చతురతను విద్యార్థులు అలవర్చుకోవాలని అన్నారు. ప్రిన్సిపల్ రామచంద్ర ఆర్‌కే విద్యార్థులకు పలు అంశాలు వివరించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16న హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్న మూడవ వన్‌డే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అకాడమియా ఫార్మా సెనర్జీ అడ్వాన్స్‌డ్ ఆర్గానిక్ సింథసిస్ అండ్ ఫార్మాస్యూటికల్ ఇన్నోవేషన్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్ సెమినార్ పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.మల్లికార్జున, టి.శ్రీనివాసరావు, శ్రీధర్, బి.వెంకటరావు, కె.వెంకటరావు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని మంగారాణికి ప్రతిభా పురస్కారం



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయిని మంగారాణి

కంబాలచెరువు: స్థానిక లాలాచెరవు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న మోటూరి మంగారాణిని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు శనివారం ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. అమరావతిలో సమగ్ర శిక్ష కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు సర్టిఫికెట్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆ వివరాలను మంగరాణి తెలిపారు. పాఠ్యపుస్తక రచయితగా, ఆన్‌లైన్ వీడియో పాఠాలు, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా బోధనావీడియో రూపకల్పన, పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్ అనుసంధానం, డిజిటల్ కంటెంట్‌లో సమగ్రశిక్షకు మంగారాణి అందించిన సేవలు విలువైనవని పీడీ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మంగారాణిని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈవో 2 రమా రజని, ప్రధానోపాధ్యాయిని యు.జయలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రంగంపేట: వ్యాధుల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ వేణుశ్రీలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధి బాధితుల గుర్తింపు, నివారణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, తాగునీరు శుభ్రత, దోమల నియంత్రణ, ఆహార పదార్థాల పరిశుభ్రతపై సూచనలు అందిస్తున్నామన్నారు. సింగంపల్లి పీహెచ్‌సీలోని అన్ని గ్రామాల్లో డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొంటున్నారని తెలిపారు.

ప్రతిభావంతులను గుర్తించేందుకే ఇంటర్వ్యూలు



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్: రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)ను నడిపించగల ప్రతిభావంతులను గుర్తించేందుకే ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు హబ్ డైరెక్టర్, జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. బొమ్మూరులోని ఆర్‌టీఐహెచ్ భవనంలో వివిధ విభాగాల అధ్యక్షులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ ఎమినెంట్ బోర్డు సభ్యులు, అకాడమిక్ నిపుణులు, అధికారులు, సెలెక్షన్ ప్యానెల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అభ్యర్థుల ఇన్నోవేషన్, లీడర్‌షిప్ సామర్థ్యాలు, ఎంట్రప్రెన్యూరియల్ మనోభావం, స్టార్టప్ కల్చర్ అభివృద్ధిపై దృష్టి వంటి అంశాలపై మూల్యాంకన చేస్తున్నామన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఇంటర్వ్యూల తీరును కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షించారని జేసీ తెలిపారు. ఇంటర్వ్యూల ఫలితాలు బోర్డు సమీక్షలు పూర్తయ్యాక త్వరలో తెలియజేస్తామన్నారు. గ్రీన్‌కో సీఎస్‌వో రాంబాబు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కేవీ స్వామి, కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గోపాలకృష్ణ, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి శ్రీవనిధర్ రామన్, ఇండస్ట్రియల్ ప్రొమోషన్స్ అధికారి టీవీ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బాక్స్ కల్వర్టులు పూర్తిచేయాలి

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారిపై పెండింగ్‌లో ఉన్న బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను పూర్తిచేయాలని నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్‌కుమార్‌ను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. శనివారం దివాన్‌చెరువులోని పీడీ కార్యాలయంలో గోరంట్ల ఆయనను కలసి పలు సమస్యలను వివరించారు. మోరంపూడి ఫ్లైఓవర్ ఇరువైపులా సర్వీసు రోడ్లు వర్షాలకు ఛిద్రమయ్యాయని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. బొమ్మూరు జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని, నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. బొమ్మూరు, హుకుంపేట, వేమగిరి, కడియపులంకలో జాతీయ రహదారిపై బాక్స్ కల్వర్టులు నిర్మించేందుకు గతంలో ప్రతిపాదనలు పంపించామని త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ఇటీవల కేంద్ర మంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన లాలాచెరువు జంక్షన్, ఐటీసీ జంక్షన్, వేమగిరి జంక్షన్, అలాగే దివాన్ చెరువు గామన్ జంక్షన్ తదితర ఫ్లైఓవర్ ప్రాజెక్టులపై చర్చించారు.

అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిలో సినీ గీతాలు ఆలపిస్తున్న ప్రముఖ నేపథ్యగాయని ఎస్పీ శైలజ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన సాంస్కృతిక సంగీత విభావరి ఆహూతులను అలరించింది. ముందుగా గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సినీ, టీవీ నటుడు శుభలేఖ సుధాకర్, ప్రముఖ నేపథ్య గాయని ఎస్పీ శైలజ దంపతులు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, అల్లు బాబీ, గాలి సుబ్బరాజు, వేగిశెట్టి కోదండ రామయ్య, డా కంటే వీరన్న చౌదరి, జీవీ రమణ, జీవీ మురళి తదితరులు చేతులమీదుగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. డాక్టర్ల పిల్లలు ప్రదర్శించిన బాలరామాయణం అలరించింది.ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన వేదంలా ఘోషించే గోదావరి పాటతో సంగీత విభావరి జీవీ రమణ(రాకా) సారథ్యంలో ఆరంభమైంది. ప్రముఖ నేపథ్యగాయని ఎస్పీ శైలజ, గాయనీ గాయకులు, డాక్టర్లు కంటే వీరన్నచౌదరి, వట్టి గంగాకిషోర్,ఎన్ఎస్.రామారావు, బోడపాటి శ్రీనివాస్, షేక్‌మహమ్మద్‌షాఆలీ, భమిడిపాటి రామకృష్ణమూర్తి, అనిత, లలితారాణి పలు గీతాలను ఆలపించారు.

మెప్మా పథకాలపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి కుటుంబం నుంచి ఓ వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యంగా మెప్మా అడుగులు ముందుకు వేస్తున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వెంకటరమణ తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు), రీసోర్స్ పర్సన్లు (ఆర్పీలు)ల శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొని పలు అంశాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా ద్వారా అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం పీఎం సూర్య ఘర్ పథకంపై ఎల్విన్ సోలార్ ఎనర్జీ సంస్థ జోనల్ మేనేజర్ రవి ప్రకాష్ ఆర్పీలకు అవగాహన కల్పించారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ సీనియర్ మేనేజర్ రాజేంద్ర, టీఎంసీ సాయికుమార్, టెక్నికల్ ఎక్స్ పర్ట్స్ ఫణికుమార్, శ్రీదేవి పాల్గొన్నారు.

చవితి ఉత్సవ మండపాల తనిఖీ



వినాయక చవితి ఉత్సవాల కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహాకిశోర్

కంబాలచెరువు: వినాయక చవితి ఉత్సవ మండపాలను ఎస్పీ డి.నరసింహాకిశోర్ శనివారం తనిఖీ చేశారు. నిమజ్జన సమయంలో పాటించాల్సిన నియమ నిబంధలను ఉత్సవ కమిటీ సభ్యులకు వివరించారు. మండపాల వద్ద భద్రత చర్యలు, నిమజ్జన సమయంలో పాటించాల్సిన నిబంధనలపై సూచనలు చేశారు. చెరువులు, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో సుడిగుండాలు ఉండవచ్చని నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశంలోకి చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకుని రావద్దన్నారు. ఊరేగింపు సమయంలో ఇతర కుల, మతాలకు, వర్గాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించకుండా సంయమనం పాటించాలన్నారు. డీజేలను ఉపయోగించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులు తీసుకునే చర్యలకు ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల పరిశీలన

కంబాలచెరువు: క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని బొమ్మూరు డైట్ ప్రిన్సిపాల్ ఆర్డేడీ రాజు అన్నారు. స్థానిక ట్రైనింగ్ కళాశాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్లస్టర్ సమావేశాలను శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ ఎస్.రవికుమార్, సుజాత కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శంభాజీరావు సేవలు ఎనలేనివి



శంభాజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు కొనియాడారు. శనివారం బొమ్మూరులోని మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. శంభాజీరావు చిత్రపటానికి ఆకుల, రౌతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు యెనుముల త్యాగరాజు, ముద్దాల అను, న్యాయవాది ప్రసాద్, పాస్టర్లు, ప్రజలు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆకుల వీర్రాజు పరామర్శ

కడియం: ఇటీవల మాతృవియోగం పొందిన దుళ్ల మాజీ ఎంపీటీసీ తోకల వీరవెంకట్రావు, ఆయన కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు శనివారం పరామర్శించారు. వారి మాతృమూర్తి సత్యవతి మృతికి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. వీర్రాజు వెంట ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, స్థానిక నాయకులు కంటిపూడి సాయి, పోసియ్య ఉన్నారు. వీరవెంకట్రావును పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తదితరులు ఉన్నారు.

'సారథ్యం యాత్ర' విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సారథ్యం పేరుతో తలపెట్టిన యాత్రలో భాగంగా సెప్టెంబర్ 1న రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.